# భల్లూకస్వప్నం

పదకొండు గంటలు కాకుండానే తద్దినం పెట్టుకుని, బరువుగా భోంచేసి, రికార్డు కట్టలు చంకని సంధించి, ప్లీడరు గుమాస్తా గవరయ్య కోర్టుకి చేరుకున్నాడు. ముందురాత్రి అన్నంలేదు. ఆ ఉదయం కాఫీలేదు. కళ్ళుమొయ్యా నిద్దర, కణతలనిండా నొప్పి బాధపెడుతున్నా వేళకి కోర్టుకి వెళ్ళడం తప్పిందికాదు. ఆపసోపాలుపడుతూ కోర్టు వరండాలోకి వెళితే, జడ్జిగారింకా రాలేదు. షెడ్డులో కెళితే ప్లీడరు గుమాస్తాలు, కోర్టు చందుగు పెట్టెలమీద కునుకుతున్నవాళ్ళు కునుకుతున్నారు. గుమిగూడి కబుర్లు చెప్పుకొనేవాళ్ళు చెప్పుకుంటున్నారు. కోర్టు ఆవరణనిండా గుంపులుగుంపులుగా పార్టీలంతా నిండి ఉన్నారు.

"జడ్జీగారి కూతురికి పురుడొచ్చి ప్రాణాలమీద కొచ్చిందట" అని తోటి గుమాస్తా చెప్పేడు.

"జడ్జిగారొస్తారా?" అన్నాడు గవరయ్య.

"వస్తారట"

జడ్జీగారు వస్తారు. ఆయన చండశాసనుడు. నలుగురు లాంటివారు కారు. ప్రపంచం తల్లక్రిందులై పోయినా కోర్టు చెయ్యడం మానరు. త్వరితంగా, సునిశితంగా వ్యాజ్య నిర్ణయాలు చేస్తారు. గవరయ్య ఇంటికిపోయి పడుకోవచ్చునని అనుకోలేదు. అందుచేత తుంగచాప పరిచి, ఉత్తరీయం లుమ్మచుట్టి చందుగమీద తల ఆనించాడు.

"ఏమండీ ఇదేమైనా న్యాయమే?" అంటూ ఒకపార్టీ ఎదురుగుండా వచ్చి గవరయ్య నడిగేడు.

గవరయ్య న్యాయవాదిదగ్గర గుమస్తా, ఔను. వాళ్ళ దగ్గరకొచ్చే పార్టీలంతా న్యాయాన్ని కోరే వస్తారు. కాని గవరయ్య వాళ్ళందరికీ అన్యాయం చెయ్యడమే వృత్తిగా పెట్టుకున్నాడు. పార్టీకి జడ్జీగారు న్యాయమిస్తారు కాని, ఈ లోగా ప్లీడరు గుమాస్తా చాలా అన్యాయం చేస్తాడు.

"ఇది బాగులేదు సుమండీ!" అన్నాడు మళ్ళా. గవరయ్య జవాబు చెప్పకుండా ఉదంతాన్ని గమనిస్తున్నాడు.

"కిందటి దఫా సాక్షి పట్టీలకి ఇచ్చిన దబ్బు కట్టక వాడేసుకుని, చల్లగా వాయిదా వేయించేశారు, బాగుందా?"

"సర్వం తెలిసినవాళ్ళు, తమరూ అలాగ శలవిస్తే మేమే నూతిలో పడం? కిందటి దఫా సాక్షి పట్టీలు కట్టేమనుకోండి. సాక్షులంతా వొచ్చారనుకోండి. వొచ్చినా ఏమి ప్రయోజనం? ఆవేళ సెషన్సుకేసు ఉన్నాది. వాయిదా ఎలాగూపడిపోను. కట్టకపోయామో లాభం పొందేమో. ఆ డబ్బు మాకిచ్చే వాలంట్రీకింద కట్టుకోండి, కాదన్నామా? కష్టపడుతున్న వాళ్ళం. ఏ కక్కుర్తీ పడకపోతే మా దినం తీరడం ఎలాగ...." అంటూ గవరయ్య సంజాయిషీ చెప్పడం ప్రారంభించాడు.

"అందుకే రష్యా ప్రభుత్వాన్ని మెచ్చుకోక తప్పడంలేదు. అబ్బబ్బ ఎంత దోపిడీ! ఎంత మోసం!"

"అయ్యా నేను చెప్పుతున్నాను-వాలంట్రీలో చూచుకోండి."

"ఈ ఆటలన్నీ రష్యాలో లాంటి ప్రభుత్వం వస్తే కట్టాలి కాని, లేకపోతే ఈ మెషీనులోబడి మనిషి ఏమి నలిగిపోతున్నాడు!"

"మీరు చెప్పుతున్నది నాకు బోధపడ్డంలేదు."

"నీ కెలాగ బోధపడుతుంది నాయనా? కోర్టులంట తిరుగుతున్న పార్టీలకు బోధపడుతుంది. అణగారిపోతున్న వాళ్ళకి బోధపడుతుంది. వాళ్ళని పీక్కుతినే నక్కలకీ, రాబందులకీ బోధపడదు. ఈ వెధవడబ్బు అన్నది లేకుండాపోతే-దురన్యాయాలు, సివిలుదావాలు ఎక్కడివక్కడ మాయమైపోతాయి."

"సార్! మీడబ్బు వాలంట్రీలో చూచుకోండి. మేమేం తినీలేదు."

"ఆఁ తినీలేదు! ఈ రాబందులకి....అబ్బబ్బ ఏమి క్షోభపడుతున్నాను"-అంటూ వెళ్ళిపోయాడు.

గవరయ్య పార్టీ తిట్టేడని ఆగ్రహించలేదు. ఆగ్రహిస్తే పనులు జరగవు. పార్టీ శాపాలతో నిద్రమత్తు సగం వదిలినా, కణతల నొప్పి అధికమైపోయింది. ఆవేళ కోర్టులో దాఖలు చెయ్యవలసిన "ఈపీలు," ఫైలు చెయ్యవలసిన "మెమోలు" విచారణకి పోస్టు అయినవి, ఇంకా

వాయిదాలు పడుతూ కొన్నేళ్ళపాటు ఉండవలసినవీ, బోలెడన్ని. "ఒఎస్సులు" కావలసినవన్ని ఉన్నాయి. వాళ్ళ ప్లీడరుగారు బార్రూమ్‌లో బాతాఖానీ కొడుతున్నారు. గవరయ్య తల చందుగకి ఆనించి మళ్ళా కునకడం మొదలెట్టాడు.

"బాబు ఇక్కడ టాంపులెండరు ఏరీ?" అంటూ పల్లెటూరి నాయుడొచ్చి గవరయ్య నడిగేడు.

"ఏం కావాలి?" అన్నాడు కళ్ళు విప్పకుండానే.

"వకాల్తీకి రూపాయి ముదుర వొట్టుకు రమ్మన్నారు."

"నేనిస్తాను తే" అని రూపాయి కాయితం పుచ్చుకొన్నాడు. జేబులో కాయితాల మడతలు తీసి, అందులోంచి రూపాయిముద్రతీసి యిచ్చాడు. నాయుడు ముద్రని తిరగళ్ళా బోర్లా చూసి "ఇదేటండీ-ఎనక వోడి నట్టుంది?" అన్నాడు.

"తఖ్లేదు పడదంటే పట్టుకురా" అని కళ్ళుమూసి జవాబుచెప్పి నాయుణ్ణి సాగనంపేడు. పొద్దున్న పార్టీలచేత స్టాంపులు తెప్పించి వాళ్ళ చూస్తూవుండగా అంటించి, తరువాత తస్కరించేశాడు. ఆ బాపతు ముద్రలలో ఒక రూపాయి సొమ్ము అయింది.

జడ్జీగా రొస్తారన్న పక్క బెదురుతో, జడ్జీగారొస్తే సాయంకాలం వరకూ నిలువుజీతం పుచ్చుకోవాలన్న కారణంచేత నిద్ర ఎంత ముంచుకొస్తున్నా నిగ్రహించుకొస్తున్నాడు.

షెడ్డులో పార్టీలు, గుమాస్తాలు కోర్టు భోగట్టాలు వొదిలిపెట్టి లోకాభిరామాయణంలోకి దిగారు. యుద్ధగమనాన్ని ప్రస్తావనలోకి లెచ్చి రష్యా క్షేత్రంలో పడ్డారు.

ఊళ్ళో పెద్ద పెద్ద వాళ్ళు ఒకరిద్దరు "వెర్రి" వాళ్ళు తప్ప అంతా ఏముంది రష్యా పదివారాల్లో పడిపోతుందనుకున్నారు. ఇహనేముంది? మాస్కోనుంచి రష్యా ప్రభుత్వం పలాయనమై పోయిందన్నారు. రష్యా వెనక్కి మళ్ళిమళ్ళి, ఇప్పుడటుంచి ఇటు తిరిగి తిప్పికొట్టి సైనిక లక్ష్యం తరువాత సైనిక లక్ష్యం పునః స్వాధీనం చేసుకొంటూ జర్మనీచేత పలాయనమంత్రం చదివిస్తూంది. అడుగు నుంచి ఆఫ్రికా పోయి, సిసిలీ

పోయి, ముసోలినీ పోయి, యుద్ధమంతా తారుమారైపోతూంది. ఇవన్నీ చెప్పుకొంటుంటే ఒకరిద్దరికి విచారం పట్టుకుంది.

ఉన్నవాడూ, లేనివాడూ, అందలమెక్కేవాడూ, మోసేవాళ్ళూ, ఆడామొగా, పెద్దంతరం చిన్నంతరం లేకుండా- మనుషులందర్నీ ఏకం చేసి, సర్వమంగళం చెయ్యడానికి తలపెట్టడం కలిమహాత్యంకాక ఇంకే ముంది? మనం బతికుండగానే కలి అమలులోకి రావాలా-మన తరవాత తరానికి వాయిదావేస్తే బాగుణ్ణు! అని ఒక పార్టీ మొరపెట్టుకొంటున్నాడు. "వాయిదాలు వెయ్యడం జడ్జీగారి చేతిలోలేక మనచేతుల్లో ఉంటే బాగుణ్ణు" అని ఒక గుమాస్తా జవాబు చెప్పేడు.

గవరయ్యకి రాజకీయాలు ఇష్టం లేకపోయినా, యుద్ధం భూగోళాన్ని చుట్టబెట్టినకొద్దీ దేశచరిత్ర తరువాత దేశచరిత్ర చొప్పున లోక చరిత్రంతా తెలుసుకొనక తప్పిందికాదు. కబుర్లు వింటూ, పత్రికలు చదువుతూ, రేడియోలు వింటూ ఉండడాన్ని, జనసామాన్యం యుద్ధం మూలాన ఎంత నలిగిపోతున్నా ప్రపంచ పరిస్థితుల్ని తెలుసుకోక తప్పింది కాదు. చందుగ పెట్టిమీద ఉత్తరీయం మడతల్లో తలపెట్టాడు గవరయ్య. మగతలో రష్యా ఇంకా ఇంకా గెలుస్తున్నట్టు, జర్మనీ ఓడిపోతున్నట్టు, బల్గేరియా-యుగోస్లావియా దేశాలు ఎర్రజెండా ప్రభుత్వాలు నెలకొల్పినట్టు కలగన్నాడు. ఆ కలతోనే గాభరాపుట్టి మెలుకువ వచ్చింది. నిజం కాదు స్వప్నమేనని నిర్ధారణ చేసికొని కుదుటపడ్డాడు. సోషలిస్టు రాజ్యం వస్తే ఏముంది? డబ్బున్నవాళ్ళు, వాళ్ళ లావాదేవీలు, వ్యాజ్యాలు ఉంటే, తన ప్లీడరుగారి ఫైలు ఇంకా ఇంకా పెరిగితే, తనకేమేనా ఉందనుకొని మళ్ళా కునకడ మారంభించాడు.

ఆవేళ కోర్టులో సమశానపాలెం జమీందారు పిటీషను విచారణకొచ్చి, సదరు జమీందారుగారు వ్యవసాయదారులని ఋజువయి, జడ్జీగారు వ్యవసాయదారుడే అని తీర్పు చెబితే జమీందారు గారికి మూడు లక్షల రూపాయల ఋణాలు ఎగగొట్టేయడానికి అవకాశం వస్తే, ప్లీడరుగారికి వెయ్యి న్నూటపదహార్లు, గవరయ్యకి నూటపదహార్లు జమీందారుగారు ఇస్తామని వాగ్దానం చేశాడు.

గవరయ్యకి కలత నిద్దర మళ్ళా కలల నిద్దరయింది. వేవెల్ రాజప్రతినిధి రాగానే ఇండియా ప్రభుత్వం ప్రజలకి అప్పచెప్పేశాడని, ప్రజలు సోషలిస్టు రాజ్యం స్థాపించ బోతున్నారనీ, సమశానపాలెం జమీం దారుగారి దావాతో సహా అన్ని దావాలూ బుట్టదాఖలా చేస్తారు కాబోలు ననీ, అందరి ఆస్తుల్ని ప్రజలు స్వాధీనపరచుకొంటారు కాబోలుననీ, సమశానపాలెం జమీందారు తనకి న్యాయంగా ఇవ్వవలసిన వాలంట్రీ అయినా ఇంకా ముట్టచెప్పలేదు నేనెలాగ చచ్చేదనీ, ఏడ్చుకొని, ధన మూల మిదంజగత్తన్న ప్రాచీన సంస్కృత ప్రమాణాన్నే ధిక్కరించి అందరి దగ్గర ధనం లాక్కుంటామనడం ఏమి న్యాయమనీ, ముందు జ్ఞానంతో కరువొస్తుందని జాగ్రత్త చేసుకొన్న రెండు గరిసెల ధాన్యం రహస్యంగా సంగ్రహించి దాచుకొన్న రెండు వేల రూపాయల వెండి బిళ్ళలు, పెళ్ళాం మెళ్ళో బంగారం లాక్కుంటారు కాబోలురా దేముడా అనీ, త్వరగా యింటికి పరుగెడదామని నాలుగు అడుగులువేస్తే రాయి తగిలి బొటనవేలు గోరు ఎగిరిపోయి రక్తం బొటబొట కారడ మారం భించింది. వేలుకింత మన్నుతీసి మెత్తి కుంటుకుంటూ వీధి మలుపు తిరి గితే, తెల్లని భల్లూకం ఎదురుగా వచ్చి వెనకకాళ్ళమీద నిలబడి కాళ్ళతో పీక పట్టుకోబోతే' మొర్రోమని గట్టిగా కేకేశాడు.

ఎదురుగా ఉన్న గుమస్తాలు, పార్టీలు పక్కున నవ్వి కొట్టిలేపితే గవరయ్యలేచి కళ్ళు నులుముకొని బీరపువ్వుల్లాగ విప్పి పరిస్థితి గ్రహించి ఇదంతా నిజంకాదు - ఇంకా డబ్బుకోసం, స్థిరాస్తులకోసం వ్యాజ్యాలు, ప్లీడర్ల వకాల్తనామాలు, రికార్డు కట్టలూ, వంశవృక్షాలూ భద్రంగానే ఉన్నాయి. ఇండియాలో పౌరపాట్లేమీ సంభవించలేదని గుర్తించి, కాలి బొటనవేలి నొప్పి ఇంకా ఉండటానికి ఆశ్చర్యపోయి చూస్తే బొటనవేలికి దెబ్బైనాలేదు.

అందరినీచూసి "ఇవ్వాళ మా యింట్లో మా తండ్రిగారి ఆబ్దికం. తల బద్దలై పోతున్నాది. నిద ముంచుకొస్తున్నాద"ని చెప్పి నలుగురితో పాటు తనూ నవ్వాడు.

రష్యాదేశాన్ని భల్లూకంగా నిరూపించి రాసిన కార్టూన్లు తను పేపర్లలో చూసినసంగతి జ్ఞాపకమొచ్చింది. ఎప్పుడెప్పుడో ఎక్కడెక్కడో

వీధుల్లోకి ఎలుగుగొడ్లని తీసుకొచ్చి వాటితో కుస్తీ ప్రదర్శనాలు చూపించిన ముష్టివాళ్ళు జ్ఞాపక మొచ్చారు. భల్లూకపుపట్టు అన్న సామెత జ్ఞాపక మొచ్చింది.

ఇహను పడుకుంటే పీడ కలలొస్తాయని హోటలుకు పోయి టీ నీళ్ళుతాగి కోర్టులో కెళితే జడ్జిగారు అప్పుడే కట్టలుతీస్తూ మొహంలో మార్పులేవీలేకుండా నిశ్చలంగా, శాంతంగా కూర్చున్నారు. కోర్టు బంట్రోతు "బగాది అప్పన్నా" అంటూ మూడుసార్లు కేకేశాడు.